ప్రతిభా పురస్కారాల ప్రదానం



విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్న దృశ్యం

గౌతంనగర్: యాదవ్స్ సేవా సంఘం ఆధ్వర్యంలో 10 వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం గౌతంనగర్ డివిజన్ పరిధిలోని మనిషా ప్రియా గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ చాటిన 250 మంది విద్యార్థులను ఘనంగా సన్మానించారు. అనంతరం సర్టిఫికెట్‌తోపాటు మెమెుంటోలను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అల్లాడి శరత్ యాదవ్ మాట్లాడుతూ గత మూడేళ్లుగా యాదవ విద్యార్థులకు ప్రోత్సహించేందుకు ఏటా అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఎంపిక చేసి సన్మానిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మహేష్ యాదవ్, జంగాల శ్రీరామ్ యాదవ్, అయెద్య రామ్, శ్రీకాంత్ యాదవ్, సునీత, సిద్ధేశ్వర యాదవ్, టి. శివ కుమార్ యాదవ్, జితేందర్ యాదవ్, లక్ష్మీ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ గీత ప్రవీణ్

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్ ఇందిరానగర్‌లో రూ. 10 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆదివారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్‌లతో కలిసి శంకు స్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామన్నారు. కాలనీలు, బస్తీల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. చిలుకానగర్ సమగ్ర అభివృద్ధికి కార్పొరేటర్ చేస్తున్న కృషి అభినందించారు. కార్యక్రమంలో బన్నాల ప్రవీణ్, ఇందిరానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, స్థానిక బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

సేవ చేసే అవకాశం కల్పించండి



నర్ల సురేష్ ప్యానల్ సభ్యులు

అల్వాల్: గంగపుత్రులకు సేవ చేసే అవకాశాన్ని కల్పించాలని నర్ల సురేష్ అన్నారు. మచ్చబొల్లారం మహాత్మగాంధీనగర్‌లో జులై 7న గంగపుత్ర సంఘం ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల్లో అధ్యక్ష పదవికి నర్ల సురేష్ పోటీ పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఆయన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. ఈ సందర్భంగా నర్ల సురేష్ మాట్లాడుతూ సమాజంలో ఎన్నో సేవా కార్యక్రమాలను చేసి ప్రజల మన్ననలు పొందిన తనకు గంగపుత్రులకు సేవ చేసే అవకాశం ఇవ్వాలని కోరారు. గపడ ఆంజనేయులు, వద్దిర్ల సురేష్, గౌటీ స్వామి, కొండు భాస్కర్, తత్తరి సాయినాథ్, నందిరి గణేష్, పాక శ్రీనివాస్, ఏరువా పద్మారావు, గాటి నరసయ్య, పందోల నాగరాజు తమ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు.

ఆనంద్‌బాగ్ రెసిడెంట్స్ సమస్యలు పరిష్కరిస్తా



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్ రెసిడెంట్స్ సమస్యలు పరిష్కరిస్తానని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు.ఆదివారం ఆనంద్‌బాగ్ కమ్యూనిటీహాల్‌లో జరిగిన కాలనీవాసుల సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఆనంద్‌బాగ్ ఆర్‌యూబీ వద్ద స్పీడ్ బ్రేకర్లు వేయాలని, ప్రధాన రహదారి ఆక్రమణకు గురికాకుండా చూడాలని కోరారు.ఆనంద్ బాగ్ జంక్షన్ అభివృద్ధితో పాటు సీసీ కెమరాల ఏర్పాటు, సీనియర్ సిటిజన్స్ కోసం మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నృత్యాంజలి కళా క్షేత్రం గరువు భవానీ శిష్య బృందం నిర్వహించిన కూచిపూడి నృత్యం ప్రత్యేక ఆకర్శనగా నిలిచింది. పుష్పాంజలి, సీతా స్వయంవరం, గణేశా పంచరత్న, కృష్ణ శబ్దం, వినాయక కౌతం, మూషిక వాహన, ముద్దుగారే యశోద, భో. శంభో ఏక దంతాయ తదితర అంశాల్లో కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



కూచిపూడి నృత్య ప్రదర్శన

ఆదాయ మార్గాలపై దృష్టి.!

దుకాణాల సంఖ్యకు తగ్గట్టుగా ట్రేడ్ లైసెన్సులు లేకపోవడంపై ఆరా

- పురపాలికల్లో ఖాళీ స్థలాలపై పన్ను విధింపునకు చర్యలు
- ఆదాయానికి గండి కొడుతున్న సిబ్బందిపై నిఘా
- పురపాలికల్లో ఏడాది పన్ను రాబడి రూ.350 కోట్లు మాత్రమే
- ప్రజలపై భారం పడకుండా రాబడి రూ.400 కోట్లు లక్ష్యంగా చర్యలు



సాక్షి,మేడ్చల్ జిల్లా: శివారు పురపాలికల్లో ఆదాయం పెంపుతో పాటు పట్టణ వాసులకు నగరానికి సమాంతరంగా మౌలిక వసతుల కల్పనకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రజలపై భారం పడకుండా ఆదాయ వనరులు పెంచుకునేందుకు ఉన్న అవకాశాలపై దృష్టి సారిస్తోంది. ఇందులో భాగంగా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్న వాటిపై దృష్టి పెడుతోంది. ఈ నేపథ్యంలో పురపాలికల్లో దుకాణాల సంఖ్యకు అనుగుణంగా ట్రేడ్ లైసెన్సులు లేకపోవడాన్ని గుర్తిస్తోంది. కాలనీలు, వెంచర్లు, బస్తీల్లో భవనాలు, ఇళ్ల ,అపార్ట్‌మెంట్ల మధ్య ఉన్న ఖాళీల స్థలాలకు ఎలాంటి పన్ను వసూలు చేయకుండా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించటం, ముళ్ల,చెట్ల పొదలు తొలగించటం వంటి చర్యలను ఉచితంగా చేపడుతున్నట్లు గమనించిన పురపాలక సంఘాలు ఖాళీ స్థలాల (వెకెంట్ టాక్స్) పన్ను విధించటంతో ఆదాయం పెంచుకోవచ్చునని భావిస్తోంది. కొన్ని మున్సిపాలిటీలు ఈ కార్యక్రమాన్ని మొక్కుబడిగా నిర్వహిస్తున్నందున ఇకపై పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని యోచిస్తోంది.

రాబడి రూ.350 కోట్లే

నగర శివారుల్లోని 28 పురపాలికల్లో ఏడాదిలో ప్రస్తుతం వివిధ పన్నుల ద్వారా రూ.350 కోట్లు ఆదాయం వస్తోంది. ఆదాయ వనరుల పెంపు లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ తో రూ.450 కోట్లకు పెంచాలని యోచిస్తోంది. శివారు మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో 28 పురపాలక సంఘాల్లో ఆదాయ మార్గాలు పెంచుకోవడానికి అన్ని రకాల వనరులను వియోగించుకోవాల్సి ఉన్నా కొందరు ఉద్యోగులు దానికి గండి కొడుతుండటంతో వారిపై నిఘా ఏర్పాటు చేయనున్నారు.

ఆదాయం పెంపు ఇలా..

పురపాలికల్లో ఇప్పటికే కొత్తగా ఇళ్లను నిర్మించుకుంటే అనుమతులు, ఇంటిపన్ను, నల్లా పన్నుల మదింపుతోపాటు వాణిజ్య, వ్యాపార సంస్థల దుకాణాలకు ట్రేడ్ లైసెన్స్ జారీ చేయడం తప్పనిసరి చేశారు. ట్రేడ్ లైసెన్సు జారీలో పలువురు ఉద్యోగులు చేతి వాటం ప్రదర్శించటంతో లక్ష్యానికి తగ్గట్టుగా ఆదాయం రావడం లేదు. ఖాళీ స్థలాల పన్ను విధింపుతో కొంత ఆదాయాన్ని పెంచవచ్చునని అధికార యంత్రాంగం యోచిస్తోంది.

అదనంగా వసూళ్లు...

శివారులో 28 పురపాలక సంఘాల పరిధిలోని దుకాణాలు, హోటళ్లు, ఆసుపత్రులు, ఇతర షాపింగ్ మాల్స్ వంటి అన్ని రకాల దుకాణాలకు ట్రేడ్ లైసెన్స్ అవసరముంటోంది. వీరంతా ఆన్‌లైన్ ద్వారా అనుమతులు పొందుతున్నారు. రహదారులను బట్టి పొడవు, వెడల్పుల ఆధారంగా పన్ను వసూలు చేయాలి. కానీ శివారు పరిధిలో పదుల సంఖ్యలో వాణిజ్య దుకాణాలు ఉండగా కొలతలు లేకుండానే అదనంగా వసూలు చేస్తున్నట్లుగా సంబంధిత దుకాణాదారులు ఆరోపిస్తున్నారు. ఇతర వ్యాపార సముదాయాల ట్రేడ్ లైసెన్సుల జారీలోనూ ఇదే తరహాలో వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది.

ట్రేడ్ లైసెన్సు ఇలా..

వ్యాపారం నిర్వహించాలంటే.. పురపాలక సంఘానికి రుసుం చెల్లించి ట్రేడ్ లైసెన్సు పొందాలి. రుసుం విధింపులో ఇటీవల కొత్త విధానం అమల్లోకి వచ్చింది. చదరపు అడుగుకు రూ.5 చొప్పున నిర్ణయించారు. సాధారణంగా షోరూంలు, మిల్లులు, సరకు నిల్వ చేసే హోల్‌సేల్ వర్తకుల భవన సముదాయాల విస్తీర్ణం ఎక్కువగా ఉంటుంది. కొత్త విధానంలో మదింపు చేస్తే వీరు రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు చెల్లించాల్సి ఉంటుంది. కొందరు రుసుం తక్కువ ఉన్న సమయంలో లైసెన్సు పొంది తిరిగి పునరుద్ధరించడంలేదు.

దుకాణాలు ఎక్కువ..లైసెన్సులు తక్కువ

నిజాంపేట నగర పాలక సంస్థలో 4954 వ్యాపార సముదాయాలకుగానూ 2235 మాత్రమే ట్రేడ్ లైసెన్సులు ఉన్నాయి. ఇవి కూడా గుర్తించినవి మాత్రమే. ఉదహరణకు జవహర్‌నగర్‌లో 950 దుకాణలు ఉండగా 382 మాత్రమే ట్రేడ్ లైసెన్స్ తీసుకున్నాయి. దుండిగల్‌లో 1448లకు 532, కొంపెల్లిలో 1147లకు 356, నాగారంలో 1311లకు 265, పోచారంలో 451లకు 173 ట్రేడ్ లైసెన్సులు, బోడుప్పల్‌లో 2235 వ్యాపార సముదాయాలు ఉండగా, ట్రేడ్ లైసెన్సులు 553 దుకాణాలకు మాత్రమే ఉన్నాయి. దీంతో పురపాలికల్లో ట్రేడ్ లైసెన్సుల జారీ విధానం ఏ విధంగా ఉందో అర్థమవుతోంది.

ఖాళీ స్థలాలపై పన్ను..

నగర శివారు పురపాలికల్లో ఏలాంటి నిర్మాణాలు లేని ఖాళీ స్థలాల ప్లాట్లు కోకొల్లుగా ఉన్నాయి. వీటిని సంబంధిత యాజమానులు, పురపాలక సంఘాలు పట్టించుకోకపోవడంతో అవి చెట్ల పొదలు, చెత్తా చెదారం, మురికి నీటితో నిండి పందులు, దోమలకు నిలయాలుగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో ఖాళీ స్థలాలపై పన్ను విధింపుతో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచటంతోపాటు ఆదాయం పెంచుకోవచ్చునని భావిస్తున్నారు.

అక్రమ కట్టడాలపై నిఘా

పట్టణీకరణ నేపథ్యంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నగర శివారు పురపాలికల్లో కాలనీలు ,అపార్ట్‌మెంట్లు , వ్యాపార సముదాయలకు సంబంధించిన మాల్స్ వందల సంఖ్యలో పెరుగుతున్నాయి. ఇందులో చాలా మేరకు అక్రమ కట్టడాలు కొనసాగుతున్నాయి. దీంతో పురపాలక సంఘాలకు రావాలసిన ఆదాయానికి భారీగా గండిపడుతోంది. దీనిపై కూడా టాస్క్ ఫోర్స్ టీమ్‌ల తోసహా ప్రత్యేక యంత్రాంగాన్ని నియమించడం ద్వారా ఆదాయ వనరులను పెంచుకోవచ్చునని ప్రభుత్వం యోచిస్తోంది.

మల్లన్న గుడిలో 108 కళశాలతో అభిషేకం



గౌతంనగర్: లోక కల్యాణం కోసం గౌతంనగర్ డివిజన్ మల్లిఖార్జున నగర్‌లోని శ్రీ భ్రమరాంబిక సమేత మల్లిఖార్జున స్వామి దేవాలయం (మల్లన్న గుడి)లో ఆదివారం 108 కళశాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం 5:30 గంటలకు ఆంజనేయ స్వామికి, 6 గంటలకు నల్లపోచమ్మ అమ్మవారికి, 7 గంటలకు మల్లిఖార్జున స్వామి వారికి 108 కళశాలతో అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో దేవాలయ పాలక మండలి, అర్చక బృందం, భక్తులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని సెంట్ పీటర్స్ స్కూల్, శాంతి గార్డెన్, ఇందిరానగర్, రైతు బజార్‌కు వెళ్లే రోడ్డులో దాదాపు రూ.కోటితో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆదివారం నాచారం ఏఈ లింగారావు పరిశీలించారు. ఏఈ ప్రత్యేక చొరవతో పనులు వేగవంతంగా పూర్తి చేయించినందుకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రేటర్ నేత సాయిజెనిశేఖర్, శేఖర్‌గౌడ్, యాదగిరి. చంద్రశేఖర్, కట్ట బుచ్చన్న గౌడ్,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



కుషాయిగూడ: మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను ఆదివారం కుషాయిగూడ కుమ్మరసంఘం ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎంపీకి వినతి పత్రం అందజేశారు. ఎంపీని కలిసిన వారిలో ఈశ్వరయ్య, నాదం, జనార్దన్, శ్రీనివాస్, రమేష్,ప్రసాద్, శివప్రసాద్, లక్ష్మీప్రసాద్, సాయికిరణ్, సాయి కుమార్, కార్తీక్,సురేందర్, మధు, జైవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాదానం మహాదానం



విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సునీత



నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న రఘు కిరణాచార్యులు

గౌతంనగర్: అన్ని దానాల్లో విద్యా దానం గొప్పదని గౌతంనగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాముయాదవ్ అన్నారు. ఇందిరానెహ్రూనగర్ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జ్యోతినగర్ కమ్యూనిటీ హాల్‌లో పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం తన వంతు సహాయంగా కార్పొరేటర్ మేకల సునీత యాదవ్ రూ. 20 వేలు ఆర్థిక సాయాన్ని సంఘం ప్రతినిధులకు అందజేశారు. అన్ని రంగాల్లో గంగపుత్రులు రాణించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మేకల రాముయాదవ్, బైరు అనిల్, సిద్ది రాములు, సిద్ది రాములు, కిట్టు, సూర్యప్రకాష్, గంగపుత్ర సంఘం అధ్యక్ష, కార్యదర్శులు లింగయ్య, దుర్గయ్య తోపాటు కాంగ్రెస్ నాయకులు కన్నెమళ్ళ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సేవా వాహిని ఆధ్వర్యంలో..

బ్రాహ్మణ సేవా వాహిని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రఘు కిరణాచార్యులు ఆధ్వర్యంలో ఆదివారం జయగిరి లక్ష్మీనర్సింహ్మా స్వామి ఆలయంలో పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కాటూరి వంశీ, నండూరి పవన, శేషం, శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు రైతు భరోసా కల్పించాలి



మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

బోడుప్పల్: కాంగ్రెస్ ప్రభుత్వం 15 ఎకరాలు ఉన్న రైతులకు, కౌలు రైతులకు భరోసా కల్పించాలని మేడ్చల్ జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు నిమ్మల నర్సింహ్మా, కార్యదర్శి సామ వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం బోడుప్పల్ దేవేందర్‌నగర్ కాలనీలో జరిగిన మేడిపల్లి మండల రైతు సంఘం మహాసభకు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కౌలు రైతులు వ్యవసాయం చేస్తున్నారా లేదా గుర్తించి వారికి కూడా రైతు భరోసా కల్పించాలన్నారు. కౌలు రైతులకు ఎల్ఈసీ కార్డులు ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తించే విధంగా 2011 చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే రూ. 2 లక్షలు రుణమాఫీ చేయాలని, కొత్త బ్యాంక్ రుణాలు రైతులకు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం గౌరవ అధ్యక్షులు సిఎస్ దశరథ్, సహాయ కార్యదర్శులు జంగయ్య, సిపిఐ నాయకులు రచ్చకిషన్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘం నూతన కమిటీ ఎన్నిక

మేడిపల్లి మండల రైతు సంఘం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఉప్పల కొమురయ్య, మండల కార్యదర్శిగా మాచర్ల కనకయ్య, కోశాధికారి గా రమ, సహాయ కార్యదర్శిగా మేరీ, కౌన్సిల్ సభ్యులుగా శోభ, కల్పన, వనజ, నాగమ్మ, కవిత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సాయినాథుని బోధనలు సదా ఆచరణీయం



రామంతాపూర్ : వెంకట్‌రెడ్డినగర్‌లోని శ్రీ సద్గురు సమర్థ సాయినాథ్ దేవాలయంలో ఆదివారం నిర్వహించిన 17వ వార్షికోత్సవ వేడుకలకు ఎంపీ ఈటల సతీమణి జమున హాజరైన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవతా మూర్తి, దైవంశ సంభూతుడైన షిరిడి సాయి బాబా బోధించిన దయ, కరుణ, ఓర్పుతో ద్వేషాన్ని జయించవచ్చు అనే బోధనలు మానవాళికి ఆచరణీయమన్నారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ట్రస్ట్ చైర్మన్ గంజి రాజమౌళి గుప్త, అధ్యక్షుడు మహాదేవభట్ల, లక్ష్మణ్, ప్రసాద్ శర్మ, ప్రధాన కార్యదర్శి బోనగిరి శ్రీనివాస్ గుప్త, కోశాధికారి దుక్కిడి నాగేశ్వర్ రావు, నిత్యాన్న దాన చైర్మన్ పారుపల్లి హనుమంతరావుతో పాటు రాష్ట్ర బీజేపీ నేత గడ్డం సాయి కిరణ్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కుషాయిగూడ: కుషాయిగూడ జెడ్‌పీహెచ్ఎస్ 10 తరగతి 1998-99 బ్యాచ్ 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమేళ్మనం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు బాపురెడ్డి, ఉపాధ్యాయులు రమేష్‌రెడ్డి, రామస్వామిలను ఘనంగా సత్కాంచారు. కార్యక్రమంలో విద్యార్థులు పలుగుల దేవేందర్, చిత్తారి సురేంధర్‌రెడ్డి, సుదీర్, ఇస్మాయిల్, దుర్గా భవానీ, మంజుల జాన్సీ, అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

అల్వాల్: వెంకటాపురం డివిజన్ పరిధిలోని ఇందిరానగర్‌లో మూడుగుళ్ల ఆలయం 2వ వార్షికోత్సవం వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ సబిత అనిల్ కిషోర్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు అనిల్‌కిషోర్‌గౌడ్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

భాగ్యరెడ్డివర్మ ఆశయ సాధనకు కృషి చేయాలి

అల్వాల్: భాగ్యరెడ్డివర్మ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీనియర్ జర్నలిస్ట్ ఆస శ్రీరాములు అన్నారు. ఆదివారం లోతుకుంట అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రముఖ రచయిత డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్ రచించిన దళితోద్యమ వేగుచుక్క భాగ్యారెడ్డివర్మ జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆస శ్రీరాములు మాట్లాడుతూ దక్కన్ పీఠభూమిలో అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం ఎన్నో పోరాటాలు చేసిన మహనీయుడు భాగ్యారెడ్డి వర్మ అని కొనియాడారు. దేశంలోని అణగారిన ప్రజల హక్కుల కోసం బ్రిటిష్ పరిపాలనలో లండన్‌లో జరిగిన సమావేశానికి భారతీయుల ప్రతినిధిగా డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ పేరును ప్రతిపాదించిన నాయకుడు భాగ్యారెడ్డి వర్మ అన్నారు. దేశంలోని సంఘ సంస్కర్తల అందరితో పాటు మహాత్మగాంధీ, రవీంద్రనాథ్ ఠాగూర్‌తో మంచి సంబంధాలు కొనసాగించారన్నారు. హైదరాబాద్‌లో పుట్టిన భాగ్యారెడ్డివర్మ ఆంధ్రప్రదేశ్, మద్రాసు, కర్ణాటక ప్రాంతాల్లో ఎన్నో సభలు సమావేశాల్లో పాల్గొన్నారని, అత్యాచారాలు, అంటరానితనంపై తిరుగుబాటు చేశారన్నారు. పంచములం కాదు ఈ దేశవాసులం ఆది హిందువులమని గర్జించిన నాయకుడు భాగ్యారెడ్డి వర్మ అన్నారు. అణగారిన వర్గాల చైతన్యం కోసం భాగ్యయోదయం అనే పత్రికను నడిపారని కొనియాడారు. పుస్తక రచయిత పాటు పుస్తకం ప్రింటింగ్ కోసం ఆర్థిక సహాయం అందించిన మామిడి నారాయణకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో అనంతరాజ్, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి. శంకర్, గ్రామీణ బ్యాంకుల ప్రధాన కార్యదర్శి కేడి రమేష్, సీనియర్ జర్నలిస్టు సువర్ణ, పురం కన్నయ్య, ఆస శ్రావణ్ కుమార్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



దళితోద్యమ వేగుచుక్క భాగ్యరెడ్డివర్మ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆస శ్రీరాములు

శ్యామా ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి





మల్లాపూర్: నాచారం డివిజన్ బీజేపీ అధ్యక్షులు మల్కా ప్రకాష్ ఆధ్వర్యంలో ఆదివారం నాచారంలో శ్యామా ప్రసాద్‌ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మల్కా ప్రకాష్ మాట్లాడుతూ.. శ్యామా ప్రసాద్ ముఖర్జీ కలలను ప్రధాని నరేంద్ర మోదీ నేరవేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి గోపాల్‌గౌడ్, ఉప్పల్ మహిళా కన్వీనర్ అనితారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మంజుల వాణి,అమర్, వెంకటేశ్వర్లు, లావణ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

మౌలాలిలో..

మౌలాలి: భారతీయ జన్ సంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకుని మౌలాలి డివిజన్ కార్పొరేటర్ గున్నాల సునీతా శేఖర్ యాదవ్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

వినాయక్‌నగర్‌లో..



మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

శ్యామా ప్రసాద్‌ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి వినాయకనగర్ డివిజన్ కార్పొరేటర్ రాజ్యలక్ష్మీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిలో..

మల్కాజిగిరి: జనసంఘ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ శర్మ వర్ధంతి సందర్భంగా ఆదివారం శివపురి కాలనీలో కార్పొరేటర్ శ్రవణ్ నివాళులు అర్పించారు. అనంతరం విష్ణుపురికాలనీలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో శ్రీనివాస్,వెంకట్, రమణ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కుషాయిగూడలో..

శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ఆదివారం చర్లపల్లి డివిజన్ పరిధిలోని కుషాయిగూడలో ఆయన చిత్రపటానికి బీజేపీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అల్వాల్‌లో..

జనసంఘ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ఆదివారం మచ్చబొల్లారంలో బీజేపీ నేతలు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. దండుగుల వెంకటేష్, మల్లికార్జున్‌గౌడ్, సుజాత, పద్మిని, అజిత్ సాయి, ప్రదీప్, పివి, శ్రీకాంత్, నవీన్, జస్వంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ శ్రవణ్



వినాయకనగర్‌లో నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ రాజ్యలక్ష్మి